క్లుప్తంగా

గుండ్రాత్‌పల్లి సర్పంచ్ సస్పెన్షన్

కాటారం: మండలంలోని గుండ్రాత్‌పల్లి పంచాయతీ సర్పంచ్ దుర్గం వెన్నెలను సర్పంచ్ పదవి నుంచి సస్పెన్షన్ చేసినట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీఓ ఉపేంద్రయ్య శుక్రవారం తెలిపారు. సర్పంచ్ స్థానికంగా ఉండకపోవడంతో పాటు గ్రామసభలు, వార్డు సభ్యుల సమావేశాలకు హాజరవడం లేదని వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు ఎంపీఓ పేర్కొన్నారు. ఫిర్యాదులోని ఆరోపణలు విచారణలో వాస్తవం అని నిర్ధారణ కావడంతో కలెక్టర్ సర్పంచ్ వెన్నెలను పదవి నుంచి తొలిగిస్తూ ఉపసర్పంచ్ రాజబాబుకు తాత్కాలిక సర్పంచ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

మండల కమిటీలు రద్దు

ములుగు: ఏఐసీసీ, టీపీసీసీ సూచనల మేరకు మండల కమిటీలను రద్దుచేసి మండల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మండల ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. ములుగు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, వెంకటాపురం(ఎం) బైరెడ్డి భగవాన్‌రెడ్డి, గోవిందరావుపేట దాసరి సుధాకర్, ఎస్ఎస్ తాడ్వాయి బొల్లు దేవేందర్, ఏటూరునాగారం ఇరుసవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం గుడ్ల దేవేందర్, ఎండీ అయూబ్‌ఖాన్, మంగపేట గుమ్మడి సోమన్న, కొత్తగూడ చల్ల నారాయణరెడ్డి, గంగారం సుంకరబోయిన మొగిలిలను ప్రకటించారు. త్వరలో పార్టీకోసం కష్టపడి పనిచేసేవారిని గుర్తించి మండల కమిటీలు నియమిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎండీ చాంద్‌పాషా, నూనేటి శ్యాం, బండి శ్రీనివాస్, ఆకుతోట చంద్రమౌళి, మట్టివాడ తిరుపతి, నల్లెల భరత్‌కుమార్, జక్కుల రేవంత్‌యాదవ్, కమ్మరి శంకరయ్య, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, గండి కుమార్, రత్నం భద్రయ్య, చక్రపు రాజు, అజ్జు, గుండా తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని మేడారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి సీసీ రోడ్లను మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిడం బాబురావు, తాడ్వాయి మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య మండల యూత్ అధ్యక్షుడు కోట సురేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఆలకుంట కృష్ణ, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



వాజేడు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం వీచిన గాలికి దంతులూరి సుందర నర్సింహారాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కాగా శుక్రవారం ఉదయం నుంచి ఏఈ అర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులను చేపట్టారు. లైనుపై తెగి పడిన చెట్టును తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. అనంతరం తెగి పడిన విద్యుత్ వైర్ల స్థానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్తంభాలు విరిగిన కారణంగా మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ నిలిచిపోయింది.

జోరుగా 'బెల్టు' దందా!

- మద్యానికి బానిసవుతున్న యువత
- అదనపు బాదుడుతో జేబులకు చిల్లు



మొగుళ్లపల్లి: మండలంలో అధికారంగా ప్రభుత్వ అనుమతి పొందిన వైన్ షాపులు రెండు లేదా మూడు ఉంటే అనధికారికంగా రెండు నుంచి మూడు వందల బెల్టు షాపులు ఏర్పాటు చేసి జోరుగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. వైన్ షాపుల యాజమానులు సిండికేట్‌గా మారి గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో గ్రామాల్లో యువత చెంతనే మద్యం దొరుకుతుండంతో అధిక ధరలకు అయిన కొనుగోలు చేసి మత్తుకు బానిసవుతున్నారు. వీటిని అరికట్టాలని మహిళలు ఎంత ప్రయత్నించిన ఫలితం లేదు. మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో సుమారు 300 పైగా మద్యం బెల్టు షాపులు ఉన్నాయి. మండల కేంద్రంలోని మద్యం దుకాణాల ద్వారా బెల్ట్‌షాపుల నిర్వహణ సాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మద్యం దుకాణాదారులు బెల్ట్‌షాపులకు హోల్‌సేల్‌గా వేస్తూ వ్యాపారాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం దుకాణాదాలరులు ఒక్కో బాటిల్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు ఆదనంగా వసూలు బెల్టు షాపులకు ఇస్తున్నట్లు సమాచారం. వీటిని తీసుకెళ్లిన బెల్ట్‌షాపుల వారు గ్రామాల్లో మరో రూ.10 లాభం చూసుకోని మద్యం విక్రయిస్తున్నారు. దీంతో బెల్ట్ షాపుల్లో కొనుగోలు చేసే వారికి దాదాపు ఒక్కో బాటిల్‌కు రూ.30 అదనంగా చెల్లిస్తున్నారు. వైన్స్ షాపుల నిర్వాహకులు అక్కడ చేసే వ్యాపారం కంటే బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేయడం ద్వారానే అధికం ఆదాయం పొందుతున్నారు. అధికారులు నెలనెలా మాముళ్లు తీసుకుంటూ ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా వ్యవహారస్తున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యంతో 25 సంవత్సరాల లోపు ఉన్నా యువతే ఎక్కువ ప్రభావితం అవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పదించి బెల్టుషాపులను నియంత్రిచాలని లేకపోతే పేద కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు దాపురిస్తాయని ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...

ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు నిర్వహించాలి. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లుకు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

- మాన్‌సింగ్, ఎక్సైజ్ ఎస్సై

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం రాత్రి అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగుల జీవితాలతో తెలంగాణ ప్రభుత్వం చెలగాట మాడుతుందన్నారు. మెరిట్‌లో ఉన్న విద్యార్థులు ఈ లీకేజీ స్కామ్ ద్వారా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు లీకేజీ చేసిన వారిపై చర్య తీసుకోకపోవడం అవినీతిని పోత్సహించడమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కస్తూరి రమేష్ , జిల్లా యూత్ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు కుమారస్వామి, సోషల్ మీడియా అధ్యక్షుడు ఎడ్ల రమేష్, విద్యార్థి అధ్యక్షుడు కుసుమ రామకృష్ణ, సదయ్య, సంతోష్, మోహన్, నరేష్, క్రాంతి, దేవేందర్, నరేష్, ప్రవీణ్‌తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం, సూరారం, పెద్దంపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలో మెంటనెన్స్ చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలతో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన భూక్యా రాజునాయక్ మృతికి బాధ్యులైన అటవీశాఖ అధికారులపై చర్య తీసుకోవాలని గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్, గిరిజన విద్యార్థి సమైఖ్యా జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు అజ్మీరా నవీన్ నాయక్ శుక్రవారం వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారుల వేధింపుల వల్లనే రాజునాయక్ గుండె పోటుతో మృతి చెందాడని ఆరోపించారు. బాధ్యులైన సెక్షన్, బీట్ అధికారులను అరెస్ట్ చేయాలని తెలియజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిక అటవీ హక్కు పత్రాలు ఉన్న 15 సంవత్సరాలుగా ఫారెస్ట్ అధికారులు రాజును ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఫారెస్ట్ నుంచి రూ.50లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వాహనాల వేగాన్ని నియత్రించాలి



లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన అడవి పందులు

మల్హర్: అటవీ రోడ్డు గుండా ప్రయాణించే భారీ వాహనదారులు అతి వేగాన్ని తగ్గించి, నెమ్మదిగా వెళ్లాలని తాడిచర్ల అటవీశాఖ సెక్షన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మల్లారం–కొయ్యూరు నాగులమ్మ అటవీ ప్రాతంలోని మల్లారం రోడ్డుపై ఉదయం ఓ లారీ అతివేగం కారణంగా రోడ్డు దాటుతున్న అడవి పందులను ఢీకొట్టడంతో అవి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బొగ్గు లారీలను నిలిపి స్పీడ్‌పై డ్రైవర్లుకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ రోడ్డుపై వేగాన్ని నియంత్రించే వ్యవస్థ లేకపోవడంతో వన్య ప్రాణులు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వన్య ప్రాణులు ప్రమాద భారీన పడకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ములుగు: ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

ములుగు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాల్సి అవసరం ఉందని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ శుభ్రమైన భోజనాన్ని తీసుకోవడంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆరోగ్యాన్ని ఆస్తిలా భావించాలని చెప్పారు. పుట్టినప్పటి నుంచి సకాలంలో చిన్నారులకు టీకాలు ఇప్పించాలని అన్నారు. టీకాలతో రోగనిరోధకశక్తి పెరిగి జబ్బుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పకుండా నిర్వహించాలని అన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్ మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధినిర్ధారణ అయితే ప్రభుత్వం తరఫున ఉచితంగా మందులు, చికిత్స అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, సీహెచ్ఓ జినుకల దుర్గారావు, సంపత్‌రావు, రాయినిగూడెం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలో సబ్‌సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చంద్రోశేఖర్, చాముండేశ్వరి, సుచిరిత, మౌనిక, అనూష, సీహెచ్ఓ శారద పాల్గొన్నారు.

వాజేడు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు రాకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తలను తీసుకోవాలని, ఏ విధమైన నలతకు గురైనా ప్రభుత్వ ఆసుపత్రికే రావాలన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య కరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ ర్యాలీలో కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

ఏసు చూపిన మార్గంలో నడవాలి



మహాముత్తారం: ములుగుపల్లిలోని చర్చిలో హాజరైన క్రైస్తవులు

మహాముత్తారం: ఏసుప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ప్రేమను ప్రతీ ఒక్కరికి పంచాలని ములుగుపల్లి పాస్టర్ యోహాన్ అన్నారు. మండలంలోని ములుగుపల్లి గ్రామంలో జీసేస్ పవర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోహాన్ వాక్య సందేశం అందించారు. ఒకరిపట్ల ఒకరు ప్రేమానురాగాలతో కలిగి ఉండాలని ఎవరికి కూడా హాని కలిగించకుండా జీవించాలని హితవు పలికారు. ఏసుప్రభువు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని ప్రేమను ప్రతీ ఒక్కరికి పంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సురేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని సెంట్రల్ సౌత్ ఇండియా సెయింట్ థామస్ చర్చితో పాటు పలు గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిల్లో అయ్యగారు రెవ్ జెస్‌మాథ్యు, పాస్టర్ రవీందర్, సంఘ పెద్దలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లిలో..



మహదేవపూర్: మాట్లాడుతున్న పాస్టర్ జోసఫ్

మహదేవపూర్: మండలంలోని బెగ్లూర్, రాపెల్లికోట గ్రామాల్లో గల చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పాస్టర్ జోసఫ్, ప్రకాష్, సురేష్‌లు ఏసు బోధించిన శాంతి మార్గాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరు శాంతి, ప్రేమ మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ సుస్మిత పండ్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం పీహెచ్‌కి వచ్చిన గర్భిణులకు పండ్లు పంపిణీ చేసి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆమె వెంట స్టాఫ్‌నర్స్ కీర్తి, కాంటిజెంట్ వర్కర్ సయ్యద్ మఖ్బూల్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరామర్శ



కొండంపేటలో పరామర్శిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి(జంగిడిపల్లి) గ్రామానికి చెందిన భూక్యా రాజునాయక్, కొండపేట గ్రామానికి చెందిన శనిగరం లక్ష్మి మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యాప్రకాష్‌రావు, రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, సర్పంచ్ అడ్డూరి కూమారస్వామి, మండల నాయకులు కోట రవి, వాల యాదగరిరావు, కొండంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్టయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ములుగు రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా జిల్లాకేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను ఎత్తిచూపితే జైళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో పేపర్ స్కాం, లిక్కర్ స్కాం, కాళేశ్వరం కమిషన్‌లపై ఆధారపడి పాలన నడుస్తుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తుంటే జైలుకు పంపడం కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్‌యాదవ్, సిరికొండ బలరాం, కొత్త సురేందర్, మహేందర్, రాకేష్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న గోపిమాధవ్

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదిగురువు భారత సంఘం ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోపిమాధవ్ రైతులను మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పంట భూములు(ఫర్టిలైజర్స్) రసాయనాలకు అలవాటు పడి ఉన్నాయన్నారు. రైతులు అధిక దిగుబడికోసం పోటీ పడి రసాయనాలతో పంట పండించడం వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. గతంలో రైతులు సాంప్రదాయ పంటలను పండించే వారన్నారు. రైతులు చిరుధాన్యాలు, ప్రకృతి ఆధారిత పంటలను వారి వారి ఇంటివరకైనా పండించుకుని అనారోగ్యం పాలు కాకుండా అందరికి మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఎల్లంకి రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, రాంరెడ్డి, నాగభూషణం, కృష్ణమూర్తి, ఆదినారాయణ, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రహదారి సమీపంలో ఎస్సై తిరుపతి రావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై వచ్చి వెళ్లే వాహనాలను పరిశీలించి అనుమానిత వ్యక్తులు ఎవరైన తారసపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి వదిలేశారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



ఏటూరునాగారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజు



వాజేడు: కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఎస్సై అశోక్

ఏటూరునాగారం: గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వస్తే ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నందమూరి నగర్, ఆచార్యనగర్, శాలివాహనుల కాలనీ, 5వ వార్డుల ప్రాంతాల్లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు చేస్తూ అనుమానిత వివరాలను నమోదు చేసుకున్నారు. ఎస్సై రమేష్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వార్డుల్లోని ఇళ్లను జల్లెడ పట్టారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులపై పూర్తిగా దృష్టి పెట్టాలని, ఇంటికి అద్దెకు ఇచ్చే ఇంటి యజమానులు పూర్తి సమాచారం, ఆధార్ కార్డులను తీసుకున్న తర్వాతనే అద్దెకు ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

వాజేడు: కొత్త వ్యక్తులకు ప్రజలు ఆశ్రయం ఇవ్వవద్దని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం, ఆర్లగూడెం గ్రామాల్లో శుక్రవారం సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న పోలీసులకు నేరుగా వచ్చి చెప్పుకోవచ్చని తెలిపారు. మావోయిస్టులకు సహకరించవద్దని హెచ్చరించారు.

మహాముత్తారంలో 'బలగం'



బలగం చిత్రాన్ని వీక్షిస్తున్న గ్రామస్తులు

మహాముత్తారం: కుటుంబ సంబంధాలు, కుటుంబ బంధాల వాటి విలువలపై నిర్మించిన చిత్రం బలగం. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో నిర్మించిన ఈ సినిమా ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేసిన చిత్రంగా అందరి ఆదరణ పొందుతున్న తరుణంలో మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. స్థానిక సర్పంచ్ మండల లతారాజిరెడ్డి సొంత ఖర్చులతో బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిత్రాన్ని వీక్షించారు. ఈ చిత్రాన్ని ప్రదర్శించిన సర్పంచ్ దంపతులను గ్రామస్తులు అభినందించారు.